క్లుప్తంగా

మరమ్మతులు చేపట్టండి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీలత

తుర్కయంజాల్: ఉమర్‌ఖాన్‌గూడ చెరువుకట్ట మరమ్మతలను వెంటనే చేపట్టాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత సోమవారం ఇరిగేషన్ డీఈ జి.ఉషారాణిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2020లో కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్ట తెగిపోవడంతో కింద ఉన్నటువంటి 5 గ్రామాల చెరువులకు ముప్పు వాటిల్లిందని పేర్కొన్నారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు కట్ట మరమ్మతు పనులు చేపట్టలేదని, రాబోయే వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని వెంటనే పనులను చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ పొట్టి రాములు, కొహెడ మాజీ సర్పంచ్ అర్జున్ గౌడ్, నాయకులు అనిల్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

యాచారం: పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు మార్చి 30 లోపు అప్పు వాయిదా బకాయిలు చెల్లించాలని యాచారం పీఏసీఎస్ సీఈఓ నాగరాజు కోరారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి, యాచారం తదితర గ్రామాల్లో సోమవారం ఆయన నేరుగా రైతులను కలిసి మాట్లాడారు. గడువులోపు బకాయిలు చెల్లించని యెడల వడ్డీలు పెరిగి అప్పు భారంగా మారుతుందని అన్నారు. తీసుకున్న అప్పు సకాలంలో చెల్లిస్తే మరింత మంది రైతులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. వాయిదాలు చెల్లించని పక్షంలో నిబంధనల ప్రకారం రైతుల ఆస్తులు జప్తు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలను సన్మానించిన ఆలయ నిర్వాహకులు

కడ్తాల్: ఆలయాల నిర్మాణంతో భక్తిభావం మరింత పెంపొందుతుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని గానుగుమార్లతండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ సోమవారం రూ.1.25 లక్షలు అందజేయగా, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మేఘ మురళి రూ.1,00,116, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్ రూ.51వేల విరాళం ప్రకటించారు. ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సేవ్యానాయక్, పాండు, హరి, లక్ష్మణ్, రాజు, రాజేశ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన కల్పించాలి

ఎంపీపీ సుకన్య

యాచారం: జాబ్ కార్డులున్న కూలీలు ఉపాధి పనులు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీపీ కొప్పు సుకన్య ఈజీఎస్ అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఈజీఎస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. కూలీలు అధిక సంఖ్యలో ఉపాధి పనులకు వెళ్లేలా కృషి చేయాలని, చేసిన పనులకు వారం-వారం బిల్లులు అందేలా చూడాలని సూచించారు. వేసవికాలం దృష్ట్యా తాగునీరు, నీడ వసతి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేసుకునేలా కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని రాజీవ్‌నగర్ తండాకు చెందిన శోభన్ ఏడాది క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై అప్పటినుంచి మంచానికే పరిమితమయ్యాడు. బాధితుడి ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని వైద్య ఖర్చుల నిమిత్తం సాయం చేసేందుకు ముందుకు వచ్చిన స్థానిక యువత సోమవారం శోభన్‌కు రూ.26వేలు అందించారు. భవిష్యత్‌లో అండగా ఉంటామన్నారు. తోటివారికి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఝాన్సీరామ్,రవి, తులసీరాం, నాను, గణేశ్, భాస్కర్, దస్రు, కిషన్, మోహన్, శివకుమార్, విజయ్, శ్రీరామ్ ఉన్నారు.

ఇర్విన్ మండలం అయ్యేనా..?

- గత ప్రభుత్వ హయంలో తొమ్మిది గ్రామాలతో మండల ఏర్పాటుకు చర్యలు
- ప్రజల నుంచి అభ్యంతరాలను కూడా స్వీకరించిన అధికారులు
- ప్రభుత్వం మారడంతో మండల ఏర్పాటుపై అనుమానాలు



ఇర్విన్ గ్రామ పంచాయతీ భవనం

మాడ్గుల: ఈసారైనా ఇర్విన్ మండలంగా ఏర్పాటయ్యేనా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను తగ్గించాలనే ఆలోచనలో ఉన్న రేవంత్‌రెడ్డి సర్కారు కొత్త మండలాలకు ముందడుగులు వేస్తుందా అనేది వేచి చూడాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలాన్ని రెండు మండలాలుగా చేసి ఇర్విన్‌ను నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామంటూ 2023 జూన్ 28న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ డిమాండ్ పై 2022 జూలై 30న కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. ఈ క్రమంలో 2023లో ఇర్విన్, బ్రహ్మణపల్లి, ఆర్కపల్లి, అందుగుల, అన్నెబోయినపల్లి, సుద్దపల్లి, గిరికొత్తపల్లి, కలకొండ, రమణంపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని 19 పంచాయతీలతో ఇర్విన్‌ను మండల కేంద్రం చేసేందుకు ప్రతిపాదిస్తూ 15 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని గతంలో కలెక్టర్ జారీచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసి ఏడు నెలలు గడుస్తున్నా నేటికి మండల కేంద్రం ఏర్పాటుపై స్పష్టత లే దు.

మండల హోదా ఇవ్వాలి



ఇర్విన్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి. గతంలో జరిగిన జిల్లా, మండలాల పునర్విభజన సమయంలో ఇర్విన్ మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.కానీ అప్పట్లో ఏర్పాటు చేయలేదు.ప్రభుత్వం ఇర్విన్ మండలం ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలి. – వెంకటయ్య గౌడ్, ఇర్విన్, మాడ్గుల మండలం

చర్యలు తీసుకోవాలి



ఇర్విన్ మండలం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం. త్వరలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి మండల ఏర్పాటుకు కృషిచేయాలని విన్నవిస్తాం. మండలం ఏర్పాటు చేస్తే ఇర్విన్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల సమస్యలు తీరుతాయి. ప్రభుత్వం వెంటనే మండల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. – దళపతి గౌడ్, ఇర్విన్,మాడ్గుల మండలం

ఘనంగా షబ్-ఏ-బరాత్



ఆమనగల్లు: జామై మసీదులో సందేశం ఇస్తున్న ఇమామ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం రాత్రి ముస్లింలు షబ్-ఏ-బరాత్ ను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని జామై మసీదు, మహ్మదీయ మసీదు, అమాదేహిలాల్ మసీదులను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆయా మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జాగరణ చేశారు. మత గురువులు మాట్లాడుతూ.. ప్రతి ముస్లిం అల్లా అడుగుజాడల్లో నడవాలని, తోటివారి హితాన్ని కోరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మసీదు కమిటీల అధ్యక్షులు మాసూం, ఖాదర్, గౌస్ మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని గ్రామాల్లో షబ్-ఏ- బరాత్ వేడుకలను ఆదివారం రాత్రి ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఖుబా మసీదు, ఆర్షద్ మసీద్‌లో ఇమామ్‌లు మౌలానా జహీరుద్దీన్, మహ్మద్ తాజీబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రాత్రంతా జాగరణ చేసి ఖురాన్ పఠనం చేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావీద్, కోశాధికారి జహంగీర్‌బాబా, అష్రఫ్, అబ్దుల్ వహాబ్, ఆసిఫ్ అలీ, ఇర్షాద్, షకీల్, అనీస్, మహబూబ్‌అలీ, యూనుస్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం-ప్రజాపాలన, ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ రంగారెడ్డి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని పసుమాముల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కళాకారులు.. యాదయ్య, విద్యానందాచారి, కిష్టయ్య, మోహన్, రాజు, దుర్గాప్రసాద్, సునీత, మౌనిక, యాదమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఆమనగల్లు: రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

ఆమనగల్లు: పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మధ్యాహ్నం భవానీ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకుడు శ్రీనివాస్, స్థానికులు రాము, శ్వేత, ఆకుతోట శ్రీనివాస్, రాధిక, శివస్వాములు.. సాయిలు, అశోక్, శ్రీనివాస్, వెంకట్, గోపి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు...

కడ్తాల్: మండల కేంద్రంలో కొలువైయున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో చక్రతీర్థం, నాగవళి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు.. వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎగిరిశెట్టి బాబు, శ్రీకాంత్, అశోక్ రెడ్డి, వేద పండితులు వెంకటేశ్వర శర్మ, అర్చకులు వేణుగోపాల్, శ్రీధర్, రఘు, పవన్ కల్యాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్‌కి చెందిన బాటసింగారం రైతుసేవా సహకార సంఘం సభ్యుడు మల్లేశ్ గతేడాది సెప్టెంబర్ 27న మృతి చెందాడు. సహకార సంఘం తరఫున మృతుల కుటుంబానికి అందించే రూ.25వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో మృతుడి భార్య లక్ష్మమ్మకు సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ యాదవ్, మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న లెక్కల విఠల్‌రెడ్డి

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో వెలిసిన శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు మార్చి 5న ప్రారంభమై 7న ముగుస్తాయి. ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కల్యాణోత్సవానికి రండి అని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అజీజ్, చర్ల వెంకట్‌రెడ్డి, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ఏసీపీ రాజు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యతో సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని చర్లపటేల్‌గూడ సమీపంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'లాస్ట్ మినిట్ రివిజన్ బుక్స్' పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ రాజు మాట్లాడుతూ.. విద్యతోనే మంచి సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని కోరారు. పీఆర్ఆర్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు, వేణుగోపాల్, సిరాజ్, షహనాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి 'కమలం' కౌన్సిలర్



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ యాదగిరి తదితరులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన 16వ వార్డు బీజేపీ కౌన్సిలర్ హస్తం గూటికి చేరారు. సోమవారం ఆయన తన అనుచరులతో కలిసి గాంధీ భవన్‌లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు నచ్చి.. జల్‌పల్లి అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నానన్నారు. జల్‌పల్లిలో హైస్కూల్, ఎస్‌బీఐ బ్యాంక్, పోస్టాఫీస్, బస్తీ దవాఖానా ఏర్పాటు చేయించడంతో పాటు మూడు యువజన సంఘాలకు భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీలో చేరిన వారిలో దూడల దయానంద్ గౌడ్, యంజాల సుదర్శన్, వై.నర్సింహ, మంద అర్జున్ తదితరులున్నారు.

మురుగు పరుగును ఆపండి

- రోగాలబారిన స్థానికులు
- డంపింగ్‌యార్డులా బహిరంగ ప్రదేశం

ద్వారకానగర్ కాలనీని పట్టించుకోని జీహెచ్ఎంసీ



కాలనీ రోడ్డుపై పారుతున్న మురుగు




ద్వారకానగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

హస్తినాపురం: మురుగుతో పొంగిపొర్లుతున్న రహదారులు.. దుర్గంధం వెదజల్లుతున్న కాలనీలు.. పట్టించుకోని అధికారులు.. ఇదీ ఎల్‌బీనగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలో దాదాపు నెల రోజులుగా ఉన్న పరిస్థితి. సమస్యలపై అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని రోజులుగా కనీసం రోడ్లపై నడవలేకున్నామని చెబుతున్నారు. జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్నారు. మురుగునీటికి తోడు కాలనీలోని బహిరంగప్రదేశంలో వ్యర్థాలు వేస్తూ డంపింగ్‌యార్డుగా తయారు చేశారన్నారు. ఫలితంగా దోమల బెడద ఎక్కువైందని.. ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కాలనీ నూతన సంక్షేమ సంఘం


హస్తినాపురం: ద్వారకానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జక్క దామోదర్‌రెడ్డి, కోశాధికారి కొల్లు నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి




ద్వారకానగర్‌కాలనీలోని సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి. కాలనీలోని బహిరంగ ప్రదేశంలో చెత్తకుప్పలు వేయడం వల్ల డంపింగ్ యార్డులా మారింది. దీంతో దోమలు ఎక్కువయ్యాయి. అంటువ్యాధులు వ్యాపిస్తాయేమో నని భయంగా ఉంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. – పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు, ద్వారకానగర్ కాలనీ

దుర్గంధం వ్యాపిస్తోంది



సర్కిల్ అధికారులు జోక్యం చేసుకుని కాలనీలోని మురుగు సమస్యను పరిష్కరించాలి. నెలరోజులుగా మ్యాన్ హోల్ నుంచి మురుగు నీరు పొంగుతోంది. కాలనీ మొత్తం దుర్గంధం వ్యాపిస్తోంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు. – కొల్లు నర్సింహారెడ్డి, ద్వారకానగర్ కాలనీ సంఘం కోశాధికారి

ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి



ఇతర ప్రాంతాల నుంచి చెత్త తీసుకువచ్చి కాలనీలోని బహిరంగ ప్రదేశంలో డంపింగ్ చేస్తున్నారు. అయితే, ఇక్కడి చెత్త మాత్రం తరలించడం లేదు. దీంతో దోమలు చేరుతున్నాయి. సమస్యపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకొని తక్షణ పరిష్కారం చూపాలి. – జక్క దామోదర్‌రెడ్డి, ద్వారకానగర్‌కాలనీ సంఘం ప్రధాన కార్యదర్శి

పెండింగ్ వేతనాలు చెల్లించండి



కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిషన్ తదితరులు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్

మీర్‌పేట: కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో కలిసి మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, అనంతరం కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం 25 మంది కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుని, రెగ్యులర్ కార్మికుల వలె వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పాలకవర్గం జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందజేయాలని.. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు యాదయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్‌కారత్, ప్రకాశ్‌రెడి పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహ

మీర్‌పేట: శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటిక అభివృద్ధికి రెండేళ్ల క్రితం రూ.కోటి నిధులు మంజూరు చేసినా నేటికీ పనులు ప్రారంభించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాల గదులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు, భిక్షపతిచారి, భీంరాజ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, బుచ్చిరాములు తదితరులున్నారు.